# సామ్రాజ్యవాదపు తొలి వికృతరూపం మొదటి ప్రపంచయుద్ధం

**మొదటి** ప్రపంచయుద్ధం ముగిసిన 6 నెలలలోగా జలియన్‌వాలాబాగ్ సంఘటన జరిగింది. 2018 నవంబరు 11వ తేదీకి మొదటి ప్రపంచయుద్ధం ముగిసి సరిగా వందేళ్ళు. 2019 ఏప్రిల్ 13 నాటికి జలియన్ వాలాబాగ్ ఘోర దురంతానికి నూరేళ్ళు పూర్తవుతాయి.

ఈ రెండు సంఘటనలూ ఎందుకు చెప్ప వలసి వచ్చిందంటే భారత సైన్యంలో మొదటి నుండీ పంజాబీలు ఎక్కువన్న సంగతి మనకు తెలుసు. మొదటి ప్రపంచయుద్ధం ప్రారంభం కాగానే అప్పటికి సైన్యంలో వున్న పంజాబీలు (ప్రస్తుతం పాకిస్తాన్‌లోని పంజాబ్ భాగంతోసహా) దాదాపు 3 రెట్లు పెరిగారు. మన దేశంతో, మన ప్రజల ప్రయోజనాలతో ఏమాత్రం సంబంధంలేని మొదటి ప్రపంచ యుద్ధంలోకి దాదాపు 13 లక్షలమంది భారత సైనికుల్ని బ్రిటీషు పాలకులు వాడుకున్నారు. సహజంగా వారిలో పంజాబీలు ఎక్కువే వుండి వుంటారు. సుమారు 75 వేలమంది భారత సైనికులు మొదటి ప్రపంచ యుద్ధంలో చనిపోయారు. క్షతగాత్రులయినవారూ, అనారోగ్యం పాలయిన వారూ, దేశంకాని దేశాల్లో అలవాటులేని భీకర వాతావరణ పరిస్థితులలో ఎన్నో యిక్కట్ల పాలయిన భారత సైనికుల గురించి చెప్ప పనిలేదు. సహజంగా వారిలో కూడా పంజాబీలు ఎక్కువగానే వుండి వుంటారు.

ఇంగ్లాండు దేశంలో ఉంటున్న పంజాబీలు మొదటి ప్రపంచ యుద్ధం ముగింపుకి నూరేళ్ళయిన సందర్భంగా ఒక పంజాబీ సైనికుని విగ్రహాన్ని ఆవిష్కరించుకున్నారు. వెస్ట్ మిడ్‌లాండ్స్‌లో గల ఒక గురుద్వారా వద్ద నిర్మించిన ఈ పంజాబీ సైనికుని విగ్రహం క్రింద 'మహా యుద్ధ సింహాలు' అని పేరు పెట్టు కున్నారు. పంజాబీలు ప్రముఖంగా బ్రిటీషు సామ్రాజ్యం కోసం ప్రాణాలను, జీవితాలను సమర్పిస్తే – యుద్ధం ముగిసిన ఆరునెలలు తిరిగొచ్చేసరికి జలియన్ వాలాబాగ్ ఘోర దురంతాలు జరిగిపోయాయి. సుమారు 1400 మంది శాంతియుతంగా సమావేశమయి వున్న వారిని జనరల్ ఓ. డయ్యర్ అత్యంత పాశవికంగా కాల్పించి హతమార్చాడు. యుద్ధం ముగిసిన వెంటనే బ్రిటీషు సామ్రాజ్యవాదం పంజాబీలకు యిచ్చిన రక్త ప్రవాహ కానుక అది!

మొదటి ప్రపంచయుద్ధం ఎక్కడ? ఎవరి కోసం జరిగింది? అందులో భారతీయుల ప్రయోజనాలేమున్నాయి? ఆ యుద్ధ సమయంలో భారతీయ నేతలు ఎలా స్పందించారు? నేటి తరాలు తెలుసుకోవాల్సిన అవసరం వుంది. 1914 జులై చివరి నుండి 1918 నవంబరు దాకా దాదాపు నాలుగున్నర సంవత్సరాలపాటు జరిగిన మహాయుద్ధమది. ముఖ్యంగా యూరోపియన్ ప్రముఖ దేశాలు రెండు కూటములుగా ఏర్పడి సాగించాయి. ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జారిస్టు రష్యా, (1917 నుండి) అమెరికా, (యుద్ధం చివరలో) ఇటలీ ఒక కూటమి కాగా, జర్మనీ, (ఒట్టోమన్ సామ్రాజ్యపు) టర్కీ, ఆస్ట్రియా – హంగెరీ మరో కూటమిగా ఏర్పడి దాన్ని సాగించాయి.

ఆస్ట్రియా రాజు ఫ్రాంజ్ ఫెర్డినాల్‌ను సెర్బ్ జాతీయవాది హత్యగావించటంతో ప్రపంచ యుద్ధం మొదలయిందని కొందరంటూంటారు కానీ నిజానికి ఎప్పటినుండో రగులుతున్న అభివృద్ధిచెందిన దేశాలలోని కార్పొరేట్ శక్తుల నడుమ సాగుతున్న మార్కెట్టు వలసల పోటీవల్ల యుద్ధభూమిక సిద్ధమవుతున్న స్థితి వుంది. ఆ వైరుధ్యాలు బద్దలయిన ఫలితంగా పెనుమంటలా ఎగసిపడినదే మొదటి ప్రపంచ యుద్ధం.

ముందడుగులో వున్న బాగా అభివృద్ధి చెందిన దేశాలు వెనుకబడిన దేశాలనూ ప్రపంచ మార్కెట్లన్నిటినీ తమ (రవి అస్తమించని (బ్రిటీష్ వారిలాగా) సామ్రాజ్యం క్రిందకు బలవంతంగా తెచ్చుకోగా, కాస్త వెనుకడుగులోనున్న కార్పొరేట్ శక్తులకు ప్రపంచమనే తిండి బల్ల (డైనింగ్ టేబుల్) ముందు చోటు దొరకని పరిస్థితిలో ఆ చోటు కోసం పడదోసుకుంటూ పోవటం తప్ప మరో మార్గంలేని క్రూర మార్కెట్టు పోటీ ఫలితంగా బద్దలయినదే మొదటి ప్రపంచ యుద్ధం. జర్మనీ లాంటివి తగినంత ఆహారం దొరకని ఆకలిగొన్న తోడేలు లాంటివయితే, ఇంగ్లాండు, ఫ్రాన్స్, రష్యాలు.... ప్రపంచాధి పత్యంతో మార్కెట్లనే ఆహారమంతా తమదే నంటూ విర్రవీగుతున్న కాలంలో, తమ తమ ప్రయోజనాల నడుమ పెరుగుతున్న వైరుధ్యాల పరిష్కారానికి అనివార్యంగా యుద్ధం తప్ప మరో దారి లేని స్థితికి చేరిన తర్వాత పుట్టిన కార్చిచ్చే మొదటి ప్రపంచయుద్ధం.

ఒట్టోమన్ సామ్రాజ్యపు టర్కీకి చెందిన ఖలీఫా అధీనంలోని అరబ్బు దేశాలపై ఆధిపత్యం కొరకు ఒకవైపు ఇంగ్లాండ్ – ఫ్రాన్స్‌లు ప్రయత్నిస్తుంటే, అప్పటికే చమురు వాసన పట్టిన జర్మనీ, బెర్లిన్ నుండి బాగ్దాద్ (ఇరాక్) దాకా రైలు మార్గాన్ని నిర్మించింది. ఆఫ్రికాలో తన వలసల కోసం సంఘర్షణ పడుతోంది. రష్యన్ జారు చక్రవర్తుల విశాల రాజ్యపు అధీనంలోని ప్రాంతాలకై ఆశపడుతున్నది. సహజంగానే కొత్తగా మార్కెట్ల పోటీకై రంగంలోకి దిగిన ముఠాలు దూకుడుగా వుంటాయి. ఎప్పుడూ, అంతా మీకేనా మా సంగతేమిటి అంటూ ఆగ్రహావేశాలు ప్రకటిస్తాయి.

మొదటి ప్రపంచయుద్ధం మొదలవటానికి సరిగా 7 ఏళ్ళ ముందే (1907లో) జర్మనీ దేశంలోని స్టుట్‌గార్డ్‌లో జరిగిన రెండవ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ 7వ మహాసభలో రానున్న యుద్ధ ప్రమాదాన్ని గురించి తీవ్ర వాదోపవాదాలు జరిగాయి.

"కార్మికవర్గ ఉద్యమం, దోపిడీవర్గాలు రుద్దే యుద్ధం ప్రారంభించకుండా చూడటమే కాదు చేయాల్సింది. యుద్ధ ఫలితంగా ఉద్భవించే సంక్షోభాన్ని వినియోగించుకుని శీఘ్రంగా బూర్జువావర్గాన్ని కూలదోయాలని" స్పష్టంగా, వ్యూహాత్మకంగా తీర్మానించింది. కార్మిక జన బాహుళ్యాన్ని తమ సమస్యల నుండి పక్కదారులు పట్టించటానికి దోపిడీవర్గాలు రెచ్చగొడతాయని హెచ్చరించటమేకాక, పెట్టుబడిదారీవ్యవస్థ రద్దుకానిదే ఈ యుద్ధాలు అంతంకావనీ, యుద్ధానికి హెచ్చు సంఖ్యలో సైనికులను సరఫరా చేసే, హెచ్చు త్యాగాలు చేసే, మారణాయుధాల్ని ఉత్పత్తిచేసే కార్మికవర్గమే, ఈ యుద్ధాన్ని అందరికంటే తీవ్రంగా వ్యతిరేకించాలని తీర్మానించటం, ఆనాటి లెనిన్ లాంటివారి దార్శనికత ఎంత నిశితమైనదో ఒక్కసారి వెనక్కి వెళ్ళి పరిశీలిస్తే అర్థం చేసుకోవచ్చు. ప్రపంచయుద్ధం ఆరంభ మయేదాకా జరిగిన మహాసభల్లో యుద్ధ ప్రమాదంపై చర్చలు, తీర్మానాలు సాగుతూనే వుండినా, వాస్తవంగా యుద్ధం బద్దలయిన తర్వాత చాలా దేశాలలో కార్మికవర్గ నాయకులు "పితృదేశాల రక్షణ" అంటూ తమ తమ దేశాల పాలకుల సమర్థకులుగా మారిపోతే, ఒక్క రష్యాలో మాత్రమే జారు చక్రవర్తుల పరిపాలనను అంతం చేయటానికి లెనిన్ నాయకత్వాన కృషి సాగింది. ప్రపంచయుద్ధం సాగుతూండగానే, శ్రామికవర్గ మహా విప్లవం (7 నవంబరు 1917) విజయవంతమయేట్లు చేయటమేకాక, "శాంతి కావాలి" అనే నినాదాన్ని ప్రజల డిమాండుగా చేసి, మొదటి ప్రపంచయుద్ధం ముగిసిపోవటానికి కారకులైనారు.

ప్రపంచ ప్రసిద్ధ రచయిత జార్జి బెర్నార్డ్ షా లాంటి ఫెబియన్లు సామ్రాజ్యవాద మత్తులో మునిగిపోయారు. చిన్న దేశాలు, వెనుకబడిన ప్రజల అనాగరికత, ప్రపంచ పురోగమనానికి పెద్ద అడ్డంకిగా వున్నట్లు ఆయన వెలిబుచ్చాడు. బ్రిటీషు సామ్రాజ్యవాదం నాగరికతను పెంపొందించే మహాశక్తి అని ఆయన అన్నాడు. ఇంకా చాలామంది ప్రముఖ రచయితలు నాటి బ్రిటీషు సామ్రాజ్యవాద యుద్ధ రాజకీయాలకు మద్దతుగా నిలిచారు. రడియార్డ్ కప్లింగ్, ఆర్థర్ కానన్, సోమర్‌సెట్ మామ్, హెచ్‌జి వెల్స్ లాంటివారు ఇందులో వున్నారు.

ఆ కాలంలో రవి అస్తమించని బ్రిటీషు సామ్రాజ్యంలో అతిపెద్ద వలస రాజ్యమైన మన దేశంలో ఏం జరిగింది?

బ్రిటీషు పాలకులు యుద్ధమనే ఊబిలో చిక్కుకుని ఉన్నప్పుడు, వారికి సేవ చేస్తున్న భారతీయ సైనికులలో తిరుగుబాటు తెచ్చి, దేశాన్ని విముక్తి చేయాలనే ప్రయత్నం (విఫలమై వుండొచ్చుగాక) చేసినవారు గదర్ వీరులు. వారిలో మన తెలుగువాడు దరిశి చెంచయ్యగారు వుండటం మనకు గర్వకారణం.

ఆనాటికి దేశంలో సుమారు 30 ఏళ్ళుగా జాతీయోద్యమాన్ని నడుపుతున్న కాంగ్రెసుపార్టీ, వారి నాయకులు ఏం చేశారు? 1906లో ఏర్పడిన ముస్లిం మహాసభ, 1909లో ఏర్పడిన హిందూ మహాసభ (రెండూ బ్రిటీషు పాలకుల అనుకూల ఫ్యూడల్ వర్గాలవారితో ఏర్పడ్డాయి) నాయకులు ఏం చేశారు? దక్షిణాఫ్రికా నుండి యుద్ధారంభ కాలానికి ఇంగ్లాండు వెళ్ళి అటు నుండి భారతదేశం వచ్చేసిన గాంధీగారు ఏం చేశారు? వీటిని మన చరిత్రకారులు సాధ్యమయినంత కప్పిపుచ్చే యత్నం చేశారు, చేస్తున్నారు.

మొత్తం దేశంలోనే అత్యధిక యుద్ధ నిధిని (60 లక్షల రూ॥లను) సమర్పించినది నిజాం నవాబు. ఇంకా హిందూ మహారాజాలు, ముస్లిం నవాబులు చాలామంది లక్షల రూపాయల నిధినీ, సైనికులనూ, యుద్ధ పరికరాలనూ, వస్తు సహాయాన్ని అందచేశారు.

గాంధీగారు యుద్ధం ప్రారంభమవగానే లండన్ వెళ్ళారు. అక్కడున్న భారతీయ యువకులకు "సామ్రాజ్యవాద దృష్టితో ఆలోచించమ"ని బోధించారు. "ఈ విపత్కాలంలో బ్రిటన్‌లో నివశిస్తూ కొంత సహాయం చేయగల శక్తి వున్న మావంటి కొందరం మా సర్వశక్తులను బేషరతుగా ప్రభుత్వా ధీనంలో వుంచటం భావ్యమని అనుకున్నాము. మేమూ, సంతకాలు చేసిన యితరులూ మా సేవలను ప్రభుత్వానికి సమర్పిస్తున్నామని మనవి చేసుకుంటున్నాము." అని ప్రకటించారు.

ఆనాటి భారతీయ నాయకులలో స్పష్టంగా యుద్ధాన్ని వ్యతిరేకించిన ఏకైక నాయకుడు మహమ్మదాలీ జిన్నా! మనస్ఫూర్తిగా యుద్ధాన్ని ఆమోదించనివాడు బాలంగంగాధర తిలక్. ఈనాడు అతిపెద్ద విగ్రహం నిర్మించటం ద్వారా జాతీయోద్యమ నాయకులలో అత్యంత ఆదర్శనీయునిగా భాజపాలకులతో ప్రశంసలు పొందుతున్న వల్లభాయ్‌పటేల్ అప్పటికింకా గాంధీ చాటువాడే.

1917లో బ్రిటీషు వైస్రాయి పిలుపు మేరకు "గ్రామానికి ఇరవైమంది చొప్పున సైన్యంలో చేరాలి" అన్న నినాదంతో గాంధీ గుజరాతు రాష్ట్రంలో పటేల్ స్వంత జిల్లా ఖేడాలో యువకుల్ని సైన్యంలోకి రిక్రూట్ చేస్తుంటుంటే పటేల్ కాదనలేక పోయాడు. తనను ప్రశ్నించిన వారికి గాంధీ **"సామ్రాజ్య రక్షణకై జరుగుతున్న యుద్ధంలో పాల్గొనడమే స్వరాజ్య సంపాదనకు సులభమయిన మార్గం. సామ్రాజ్యశక్తి నశిస్తే దానితోపాటు మన ఆశలూ అంతరిస్తాయి"** అన్నాడు.

భారతీయ పాలక సంస్కృతికి 'శాంతి' మంత్రాలు జపించటమంటే ఎంత యిష్టమో, ప్రపంచ అశాంతికి, యుద్ధాలకూ మూలమైన సామ్రాజ్యవాదం ముందు మోకరిల్లటమంటే అంతకంటే ఎక్కువ యిష్టం!! నిజానికి సామ్రాజ్య వాదమంటేనే యుద్ధం! అది సజీవంగా వున్నంత కాలం ప్రపంచానికి శాంతి లభించదని,ఆ యుద్ధ కాలంలోనే "సామ్రాజ్యవాదం – పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ" అనే గొప్ప చారిత్రక విశ్లేషణ కావించిన పుస్తకాన్ని లెనిన్ ప్రపంచానికి అందించాడు. అది ఈనాటికీ సత్యంగా మన కళ్ళముందు కదలాడుతూనే వుంది. పెట్టుబడిదారీ విధానం మార్కెట్ల వేటకై వలస రాజ్యాలను, అర్థవలసలను ఏర్పరచుకునే క్రమంలో 20వ శతాబ్దంలో సామ్రాజ్యవాద అవతారమెత్తిన తర్వాత ఎంతెంత మానవ హననం జరిగిందో ఈ క్రింది ప్రపంచయుద్ధ మరణాల పట్టికను పరిశీలించండి.

మొదటి ప్రపంచ యుద్ధంలో ముమ్మరంగా పాల్గొన్న ప్రధాన దేశాలు జర్మనీ, ఆస్ట్రియా – హంగెరీ, బ్రిటన్, రష్యా, ఫ్రాన్స్ ఇటలీ దేశాల సైనిక ఖర్చు 19వ శతాబ్దాంతంలో (క్రీ.శ. 1900లో) నేటి మన రూపాయల లెక్కలో 1845 కోట్లు (205 మిలియన్ పౌండ్లు)

అయితే, అదే మొదటి ప్రపంచ యుద్ధారంభానికి (1914కి) నేటి లెక్కన రూ. 3573 కోట్లు (397 మిలియన్ పౌండ్లు) అయింది. (పై గణాంకాలు 10వ తరగతి సాంఘిక శాస్త్రం (2014) పాఠ్యపుస్తకం నుండి) గడచిన నూరేళ్ళలో రష్యా – చైనా విప్లవాలు, జాతీయ విముక్తి పోరాటాలు సామ్రాజ్యవాదాన్ని నైతికంగా బలహీనపరచినా అమెరికా నాయకత్వాన యుద్ధోన్మాదాన్ని కొనసాగిస్తూ ప్రపంచ శాంతికి అది విఘాతం కల్గిస్తూనే వుంది. మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన వంద సంవత్సరాల తదనంతరం, ప్రపంచంలోని దేశాలన్నీ కలిసి కేవలం ఆయుధోత్పత్తికి 2017వ సంవత్సరంలో 1 లక్ష 73 వేల కోట్ల డాలర్లు (ఒక కోటి 21 లక్షల పదివేల కోట్లు రూపాయలు) ఖర్చు చేసినట్లు గణాంకాలు చెబుతాయి. అందులో 40 శాతం అంటే 69 వేల 200 కోట్ల డాలర్లు (48 లక్షల 44 వేల రూపాయలు) అమెరికా ఆయుధాలకై ఖర్చు చేస్తోంది. రకరకాల సైనిక కూటములు నిర్మించి తన ఆర్థిక, రాజకీయ గుత్తాధిపత్యానికై అమెరికా అహంకరిస్తోంది. 100 సంవత్సరాల క్రితపు సైనిక ఖర్చు కంటే నేడు ఆయుధాలకై చేస్తున్న ఖర్చు అనేక రెట్లు పెరిగిపోయింది.

ఈ శతాబ్దారంభంలో 2001లో ఆఫ్ఘనిస్తాన్‌తో మొదలిడి ఇరాక్, యెమెన్, లిబియా, సిరియా..... ఇప్పుడు ఇరాన్ దేశాలలో తన సామ్రాజ్యవాద దోపిడీ, పెత్తనం కోసం యుద్ధాలు చేస్తూ లక్షలాది మంది సాధారణ పౌరులను కూడా హతం చేస్తూ వస్తోంది. రెండవ ప్రపంచ యుద్ధ అనంతరం అమెరికా సైనిక జోక్యం చేసుకున్న ముప్పైఏడు దేశాలలో సుమారు 2 కోట్లమంది మరణాలకు కారణమైందని గ్లోబల్ రిసెర్చ్–2017లో జేమ్స్ ఎ. లూకాస్ రాశాడు.

యుద్ధంలో పాల్గొన్న సైనికులు చనిపోవటం సాధారణం. కానీ సామ్రాజ్యవాద యుగంలో సాధారణ పౌరులు చనిపోవటం, విధ్వంసాలు పెరిగిపోవటం ఒక విధానంగా సాగుతోంది. సామ్రాజ్యవాదం విధ్వంసాలు సృష్టిస్తే వారి వెనుక బడాబడా కంపెనీలు పునర్నిర్మాణ కాంట్రాక్టులు పొంది అన్ని రకాలుగా వెనుకబడిన దేశాలను, జాతులను ఇంకా ఇంకా పీడించటం ఒక విధానంగా వుంది.

ప్రపంచంలో అత్యధికంగా ఆయుధాలు దిగుమతి చేసుకునే దేశాల్లో భారత్ ముందు వరుసలో వుంది. (62 శాతం ఆయుధాల సరఫరా రష్యా నుండి జరుగుతోంది) అమెరికాతో 'అణు' బంధం చేసుకుంది. వారి యుద్ధ నౌకలకు ఆశ్రయం కల్పించటానికి రిలయన్స్ సంస్థకు కాంట్రాక్టును అప్పగిస్తూ మోదీ సర్కారు 'లాజిస్టిక్స్' ఒప్పందం చేసుకుంది. ఆర్థికంగా, సాంకేతికంగా సామ్రాజ్యవాద దేశాలకు పరాధీనంగా కొనసాగు తూనే వుంది. రాజకీయంగా సామ్రాజ్యవాదానికి లొంగి వారి దళారీలైన బడా సంపన్నులకు (రాఫెల్ యుద్ధవిమానాలు – రిలయన్స్ సంస్థ) సేవచేసి పెడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర పాలక ముఠాలన్నీ ప్రపంచ కార్పొరేట్ మార్కెట్ శక్తుల దళారీ సేవకు పొందే నజరానాలలో వాటాకై తగువులాడుకుంటున్నాయి. సామ్రాజ్యవాదానికి ఊడిగం చేయటంలో "నేనంటే నేనే"నని పోటీ పడుతూ, ఇతరులు చేతకానివారు అని రుజువు పరచటానికి ప్రయత్నిస్తున్నారు. దీని రూపాలే మనకు ఎన్నికల రాజకీయాలలో తిట్లు, శాపనార్థాల రూపంలో ప్రతిబింబిస్తుంటాయి.

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాపితంగానూ, భారతదేశంలోనూ సాగుతూ వుండిన పోరాట చరిత్ర ఎన్నో ఒడిదుడుకుల నడుమ సాగుతోంది. మరొకవైపు సామ్రాజ్యవాదం సంక్షోభాల వెంట సంక్షోభాలకు గురవుతూనే వుంది. ప్రపంచాన్ని యుద్ధ ప్రమాదం నుండి తప్పించాలంటే, సామ్రాజ్యవాదాన్ని తుద ముట్టించకుండా సాధ్యంకాదు. మొదటి ప్రపంచ యుద్ధంలో సమిధలైపోయిన భారత సైనికుల పట్ల, వారి కుటుంబాలపట్ల మన సానుభూతిని, బాధను గాఢంగా ప్రకటిద్దాం. సామ్రాజ్య వాదులకు, వారి దళారీలకు వ్యతిరేకంగా సాగే ఉద్యమాలను ముందుకు సాగిద్దాం.

| శతాబ్దం | మొత్తం యుద్ధ మరణాలు | ప్రతి వేయిమంది జనాభాకు యుద్ధ మరణాలు |
|---|---|---|
| 16వ శతాబ్దం | 16 లక్షలు | నలుగురు కంటె తక్కువ |
| 17వ శతాబ్దం | 61 లక్షలు | 12 మంది కంటె తక్కువ |
| 18వ శతాబ్దం | 70 లక్షలు | 10 మంది కంటె తక్కువ |
| 19వ శతాబ్దం | 1 కోటి 94 లక్షలు | 17 మంది కంటె తక్కువ |
| 20వ శతాబ్దం | 10 కోట్ల 97 లక్షలు | 45 మంది కంటె తక్కువ |

ooooo